## కూరగాయల ధరలు



శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో ... టమాట 25, పచ్చిమిర్చి 40 , బెండ 60, కాకర 40, దొండ 60, దోస 30, ఆలు 25, చామ 60, కీర 25, బీర 60, వంకాయ 50, గోకర 60, బీన్స్ 50, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 50, చిక్కుడు 70, ఉల్లి 60 (1 కేజీ), ములక్కాయలు (1) 10 , క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 250, వెల్లుల్లి 300.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నానక్‌రాంగూడ, ప్రశాంతి హిల్స్ ఫీడర్ల పరిధిలోని మధురానగర్, రాయదుర్గం పోలీస్‌స్టేషన్, రాయదుర్గం సిగ్నల్, బయోడైవర్సిటీ పార్క్, ప్రశాంతిహిల్స్, సైబరాబాద్ కమిషనరేట్, కేర్ హాస్పిటల్, డీఎస్‌ఆర్ బిల్డింగ్, ఆర్టె హాస్పిటల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు.అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## అన్నదానం

హఫీజ్‌పేట్ : చందానగర్‌లో ఆర్య వైశ్య అమావాస్య అన్నదానం కమిటి, శేరిలింగంపల్లి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాంధీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం ఎంతో గొప్పదని అన్నారు. అనంతరం ఎమ్మెల్యేను సంఘం సభ్యులు అభినందించారు. బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, వెంకటేష్, పబ్బా మల్లేష్, పులిపాటి నాగరాజు, అక్బర్ ఖాన్, అంజద్ పాషా పాల్గొన్నారు.

# దోమలు.. కంటిమీద కునుకు లేదు

- వాపోతున్న ప్రజలు.. పత్తాలేని ఫాగింగ్
- తలుపులు, కిటికీలు తెరిస్తే ఇక అంతే సంగతులు..
- ఇబ్బందులుపడుతున్న చెరువు, నాలా పరీవాహక ప్రాంతవాసులు

మియాపూర్ : చెరువులు, కుంటలు కలుషితమై దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. అండర్ డ్రైనేజీ, వ్యర్థ జలాలు ఇలా అన్నీ చెరువుల్లోకి చేరిపోతున్నాయి. ఓ వైపు గుర్రపుడెక్క, మరో వైపు చెరువు పరిసరాల్లో వ్యర్థాలు పారబోయడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా తయారవుతున్నాయి. దోమల బెడదతో కంటి మీద కునుకు ఉండడం లేదని నాలా పరీవాహక ప్రాంతాలవాసులు వాపోతున్నారు. మియాపూర్ గురున్నాథం చెరువు, పటేల్ చెరువు, రామ సముద్రం చెరువు, మక్త మహబూబ్‌పేట్ చెరువు, రేగులకుంట చెరువు, నాయినమ్మకుంట చెరువు, కిందికుంట చెరువులన్నీ కలుషితమయ్యాయి. చెరువులు గుర్రపుడెక్క, చెత్త, చెదారం మురుగు నీటితో నిండి పోయాయి.



నాయినమ్మ చెరువు

- ఏటా చెరువుల్లో గుర్రపుడెక్క తొలగించేందుకు లక్షల రూపాయలు వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితం నెరవేరడం లేదు. చెరువుల్లో మురుగునీరు చేరకుండా చెరువులను సుందరీకరిస్తామన్నా ప్రజాప్రతినిధుల హామీలు అలాగే మిగిలిపోయాయి.
- చెరువుల్లో దోమల మందు పిచికారీ చేయకపోవడంతో అవి వృద్ధి చెందుతున్నాయి.
- మియాపూర్ డివిజన్‌లో పటేల్ చెరువు సుందరీకరణ పనులను ఐదేళ్ల క్రితం చేపట్టారు. నేటికి సగభాగం కూడా పూర్తి కాలేదు. కనీసం చెరువుల్లో మురుగు చేరకుండా చర్యలు కూడా తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల కాలనీల నుండి మురుగు నీరంతా చెరువులోకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. వీటితో పాటు డివిజన్ పరిధిలోని మిగతా చెరువులకు అభివృద్ధి పేరుతో కట్టలు వేసి వదిలేశారు.



మియాపూర్‌లోని పటేల్ చెరువులో మురుగు, గుర్రపుడెక్క

- దోమలతో విషజ్వరాలు వస్తాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, నాలా పరిసరాల ప్రాంతాల్లో నివాసముండే వారు పొరపాటున సాయంత్రం, రాత్రిపూట తలుపులు, కిటికీలు తెరిస్తే ఇక అంతే సంగతులు.

### తూతూ మంత్రంగా ఫాగింగ్...

- దోమలతో డెంగ్యూ, మలేరియా జ్వరాలతో ప్రజలు ఆసుపత్రుల పాలై ఆర్థికంగా చితికిపోతున్నారు. చందానగర్ సర్కిల్ -21 పరిధిలో నాలుగు డివిజన్‌లు ఉన్నాయి. దోమల నివారణకు ఫాగింగ్ వాహనాలు 2 అందుబాటులో ఉన్నా ఒక్క మాన్యువల్ యంత్రంతోనే పనులు కొనసాగిస్తున్నారు.
- కాలనీ, బస్తీల్లో సంబంధిత అధికారులు ఫాగింగ్ చేయించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. పదిహేను రోజులకు ఒకసారి కూడా ఫాగింగ్ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- చెరువుల్లో మురుగునీరు కలవకుండా అలాగే గుర్రపుడెక్క విస్తరించకుండా చర్యలు చేపట్టాలి. ఇక చెరువు చుట్టుపక్కల ప్రాంతాలు, కాలనీల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలి. వారంలో కనీసం రెండుసార్లైనా ఫాగింగ్ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు విద్యా నాయకత్వ సమ్మేళనం

పటాన్‌చెరు టౌన్: గీతం విశ్వవిద్యాలయంలో బుధవారం భారతీయ విద్యా నాయకత్వ సమ్మేళనంను నిర్వహించనున్నారు. ఒకరోజు సమావేశంలో దేశం నలుమూలల నుంచి సీబీఎస్ఈ పాఠశాలలు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు దాదాపు 200మంది పాల్గొననున్నారు.ఉన్నత విద్యలో లిబరల్ ఆర్ట్స్, స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్)ని ఏకీకృతం చేసే చర్చలలో పాల్గొనడానికి, వినూత్న విధానాలను రూపొందించడానికి ఈ సమావేశం ఒక వేదికగా ఉపయోగపడనుంది. పరస్పరం సహకరించుకోవడానికి, ఆలోచనలను సులభతరం చేయడానికి, మెరుగైన విద్యా పద్ధతులను ప్రోత్సహించడానికి గాను దీనిని సంకల్పించారు. ఉన్నత విద్యా రంగంలో పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడం, నూతన ఆవిష్కరణలకు ఉదార విద్య, స్టెమ్ కోర్సులు ఎలా దోహదపడతాయి అనే అంశంపై ప్రముఖులు చర్చించనున్నారు. వివరాల కోసం డాక్టర్ శివకుమార్ 9542424256/66ను సంప్రదించాలన్నారు.

## స్వయం ఉపాధితో యువత ఎదగాలి



నిర్వాహకులను అభినందిస్తున్న పాండురంగారావు

కూకట్‌పల్లి: మాదాపూర్‌లో ఎఫ్ఎంఎస్‌సి రెస్టారెంట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లికి చెందిన తెలంగాణ చలనచిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల పాండురంగారావు పాల్గొన్నారు. అనంతరం పాండురంగారావుకు రెస్టారెంట్ యజమానులు పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు స్వయం ఉపాధి దిశగా ఎదగడం సంతోషంగా ఉందన్నారు.

## 'పీజేఆర్‌నగర్‌కు బస్సు నడపండి'

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ చివరి బస్టాప్, పీజేఆర్‌నగర్ బస్టాప్ వరకు బస్సు నడపాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు ఆర్‌టీసీ డిపో మేనేజర్ మహ్మద్ ఇషాక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ రూట్‌ను పరిశీలించి బస్సు వసతి కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, శ్రీదేవి, రాయుడు, దాస్, రూబెన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను వసూలులో వేగంపెంచాలి



అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్న జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

గచ్చిబౌలి: ఆస్తి పన్ను వసూళ్లను పెంచాలని వెస్ట్ జోనల్ కమిషనర్ బి.శ్రీనివాస్‌రెడ్డి రెవెన్యూ విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం వెస్ట్ జోనల్ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూళ్లపై శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్ల రెవెన్యూ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెస్ట్ జోనల్ పరిధిలో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల నుంచే ఆస్తి పన్ను వసూళ్ల సింహభాగం ఉంటాయన్నారు. మీకు నిర్దేశించిన టార్గెట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జీహెచ్ఎంసీ ఆదాయం పెంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆన్‌లైన్ అసెస్‌మెంట్లలో ఇబ్బందులు ఉన్నాయని, ఫోన్ నంబర్లు లేకపోవడంతో కొన్ని దరఖాస్తులలో ఫోన్ నెంబర్లు ఉండటం లేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో ఉప కమిషనర్లు రజనీకాంత్ రెడ్డి, వంశీకృష్ణ, ఏఎంసీలు నరేందర్ రెడ్డి, దీపక్, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, దేవేందర్, ప్రేమ్‌కుమార్, శ్రావణ్‌రెడ్డి, టీఐ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: నియోజకవర్గ కేంద్రమైన పటాన్‌చెరు పట్టణంలో 300 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను మంగళవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌లను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆసియాలోని అతి పెద్ద పారిశ్రామికవాడగా పేరొందిన పటాన్‌చెరు నియోజకవర్గంలోని కార్మికులకు అత్యాధునిక వైద్యం అందించాలన్న సమున్నత లక్ష్యంతో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలకు అనుగుణంగా అప్పటి ప్రభుత్వం ఆస్పత్రి నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, అధికారులు పాల్గొన్నారు.



మియాపూర్ బస్టాప్‌లో మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్, నాయకులు

## హామీలు నెరవేరుస్తున్న కాంగ్రెస్

మియాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తోందని శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. బుధవారం మియాపూర్ బస్టాప్‌లో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్‌కు సన్మానం

పటాన్‌చెరు టౌన్: కాలనీ సమస్యలు పరిష్కరించినందుకు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్‌ను సింఫనీ కాలనీవాసులు మంగళవారం సన్మానించారు.ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షురాలు రేఖ మాట్లాడుతూ... ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ కాలనీలో పర్యటించిన సమయంలో కాలనీలో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని కోరామని ఆ మేరకు జీహెచ్ఎంసీ కార్మికులతో కాలనీలో పేరుకు పోయిన వ్యర్థాలను, పిచ్చి మొక్కలను తొలగింప చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు పోలి పాడ్యమి

పటాన్‌చెరు టౌన్: పోలి పాడ్యమి సందర్భంగా పట్టణంలోని శ్రీరామలింగేశ్వర దేవస్థానం ఆవరణలో ఏర్పాటు చేసిన గుండంలో బుధవారం ఉదయం 4:30 నుండి 6:30 లోపు 33 వత్తులు వేసి వెలిగించి వాటిని గుండంలో వదలడం జరుగుతుందని ఆలయ అర్చకులు మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పోలి పాడ్యమి రోజున దీపం పెట్టడం వలన కార్తీకమాసం మొత్తం దీపం పెట్టినంత ఫలితం లభిస్తుందని తెలిపారు.

## కబ్జాకు ప్రయత్నిస్తే చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి కబ్జాకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్ఐ జయప్రకాశ్ నారాయణ తెలిపారు. మంగళవారం ఆయన సర్వేయర్ రామభద్రతో కలసి ఖాజీపల్లి గ్రామంలో 181 సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ మాట్లాడుతూ 181 సర్వే నంబర్‌లో ఉన్న 20 ఎకరాలు ప్రభుత్వానిదే అన్నారు. అక్రమ కట్టడాలు, భూకబ్జాకు ప్రయత్నిస్తే చర్యలు తప్పవన్నారు.

## కాంగ్రెస్ పథకాలపై నేడు అవగాహన

ఆల్విన్‌కాలనీ: కాంగ్రెస్ పార్టీ ఆరు పథకాలను తప్పకుండా అమలు చేస్తుందని, ముందుగా మహాలక్ష్మీ పథకాన్ని అమలు చేసిందని కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 10 గంటలకు కేపీహెచ్‌బీ కాలనీలోని పద్మావతి ప్లాజా ముందు ఉన్న బస్టాప్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ఇతర పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



తారానగర్‌లో సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్

## సైకిల్ యాత్ర ప్రారంభం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ మూడవ సారి భారీ మెజార్టీతో విజయం సాధించడంతో బీఆర్ఎస్ నాయకుడు వి.శ్రీనివాస్ యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సైకిల్ యాత్ర చేపట్టాడు. శేరిలింగంపల్లి తారానగర్ శ్రీ తుల్జా భవానీ ఆలయం వద్ద సైకిల్ యాత్రను కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ జెండా ఊపి మంగళవారం ప్రారంభించారు. అంతకు ముందు తుల్జాభవానీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ దుర్గం వీరేశంగౌడ్, బీఆర్ఎస్ నాయకులు కటిక రామచందర్, శ్రీనివాసరాజ్ ముదిరాజ్, కవిత గోపాలకృష్ణ, పాండు ముదిరాజ్, డాక్టర్ రవికుమార్, గోపాల్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శివపార్వతుల కల్యాణం



జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని ఆలయంలో ప్రత్యేక అలంకారం



వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం

రాయదుర్గం: కార్తీక మాసం చివరి రోజు ఆలయాలు కిటకిటలాడాయి. పూజలు, అర్చనలు, పంచామృతాభిషేకాలు, జలాభిషేకాలను నిర్వహించారు. జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరిసమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో చంద్రమౌళీశ్వరస్వామి, రాజరాజేశ్వరిమాత ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

- టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో కాశీ నుంచి తెచ్చిన స్ఫటిక లింగానికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు, అలంకారం చేశారు.
- గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో కాశీవిశ్వేశ్వరుడికి, అన్నపూర్ణాదేవికి పూజలు చేశారు.
- ఇందిరానగర్‌లోని ఇంటర్నేషనల్ శ్రీహనుమాన్ ధామ్ ఆశ్రమమ్‌లో, గౌలిదొడ్డిలోని శివాలయం, నానక్‌రాంగూడ, గోపన్‌పల్లి, గోపన్‌పల్లితండా, ఎన్టీఆర్‌కాలనీ, రాయదుర్గం ప్రాంతాలలో పూజలు చేశారు.
- మంగళవారం ఉదయం భక్తులు దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం నుంచి దీపాలు వెలిగించారు.

### లక్ష దీపోత్సవం

కార్తీకమాసాన్ని పురస్కరించుకొని రాయదుర్గంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం దీప కాంతులతో మెరిసిపోయింది. భక్తులు లక్ష దీపాలను వెలిగించారు. రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు, చైర్మన్ ఏ కృష్ణాగౌడ్, కరస్పాండెంట్ ఏ భరత్‌కుమార్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి నిర్వహించారు. సహస్ర నామ పుష్పార్చన, మహారుద్రాభిషేకం,శ్రీవారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఆర్‌జేడి విజయలక్ష్మీ వెంకట్‌రెడ్డి దంపతులు, సతీష్‌గౌడ్ సురేష్‌గౌడ్ శ్రీనివాస్‌గౌడ్ భీష్మరెడ్డి, అంజిబాబు పాల్గొన్నారు.



గాంధీని సత్కరిస్తున్న చందానగర్ నాయకులు

హఫీజ్‌పేట్ : ఎమ్మెల్యే గాంధీని చందానగర్, హఫీజ్‌పేట్ డివిజన్‌ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, గౌతమ్ గౌడ్, కార్యకర్తలు, నాయకులు మంగళవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## కేసీఆర్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే గాంధీ



గచ్చిబౌలి: సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ సీఎం చంద్రశేఖర్‌రావును ఎమ్మెల్యే గాంధీ, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావుతో కలిసి మంగళవారం పరామర్శించారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు

## మనూ-మై చాయిస్ మధ్య ఒప్పందం

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ విమెన్ ఎడ్యుకేషన్, మై చాయిస్ ఫౌండేషన్‌ల మధ్య అవగాహన ఒప్పందాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ సమక్షంలో రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు డాక్టర్ ఫర్హానా ఖాన్, ఆపరేషన్స్ హెడ్, డాక్టర్ అనితాసేబుల్, ఐసీసీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ గుల్ఫిషా న్‌హబీబ్ ,మహిళా విద్యావిభాగం అధిపతి ప్రొఫెసర్ అమీనా తహసీన్ ,ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## శుభాకాంక్షలు



కూకట్‌పల్లి: వికారాబాద్‌లో భారీ మెజార్టీతో విజయం సాధించిన గడ్డం ప్రసాద్‌ను మంగళవారం పట్టభద్రుల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర వాణిజ్య మండలి కార్యవర్గ సభ్యులు గొట్టిముక్కల పాండురంగారావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## రూ.1.75 కోట్లతో వరద నీటి కాలువ నిర్మాణం

హఫీజ్‌పేట్ : చందానగర్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో సుమారు రూ.1.75 కోట్లతో చేపట్టిన వరద నీటి కాలువ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ మంగళవారం కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఈఈ శ్రీకాంతిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల సమస్య తీరుతుందని, మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. సకాలంలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో డీఈ దుర్గాప్రసాద్, ఏఈ సంతోష్‌రెడ్డి, చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, నాయకులు అక్బర్‌ఖాన్, నరేందర్, అంజద్ పాషా, సందీప్‌రెడ్డి, ఇబ్రహీం, ఖాసీం, అశు, అజ్జు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## శివాలయంలో ఎమ్మెల్యే పూజలు

హఫీజ్‌పేట్ : కార్తీకమాసంను పురస్కరించుకొని హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రజయ్‌సిటీలోని శివాలయంలో మంగళవారం కార్తీక దీపోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గౌతమ్‌గౌడ్, వేణు, వెంకట్‌రెడ్డి, రామరాజు, నాయుడు, సునీల్, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రుద్రహోమం

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెం గ్రామంలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం అమావాస్య సందర్భంగా మాజీ ఆలయ కమిటీ చైర్మన్ గటాటి భద్రప్ప ఆధ్వర్యంలో రుద్రహోమం నిర్వహించారు. ఆలయ ఈఓ శశిధర్, నిర్వాహకుడు సోమయ్య, భక్తులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ మృతి

పటాన్‌చెరు టౌన్: భవనంలోని మూడో అంతస్తులో నీళ్లు పెట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు పడిన కిందపడిన ఘటనలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.ఎస్ఐ నాగేశ్వరరావు కథనం ప్రకారం ప్రకారం... కామారెడ్డి జిల్లా.. పిట్లంకు చెందిన శివకుమార్, భార్య జన్వి వైష్ణవితో బతుకుదెరువు కోసం ఇస్నాపూర్ వచ్చి సాయి తేజ కాలనీలో నిర్మాణ దశలో ఉన్న ఇంటికి వాచ్‌మెన్‌గా ఉంటున్నారు.ఈ క్రమంలో 11వ తేదీ ఉదయం రోజు మాదిరిగానే నిర్మాణ దశలో ఉన్న ఇంటికి నీళ్లు కొట్టేందుకు వెళ్లింది. ప్రమాదవశాత్తు కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. భర్త శివకుమార్ స్థానికుల సహకారంతో ఇస్నాపూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రి తీసుకెళ్లి అక్కడి నుండి పటాన్‌చెరుకు తీసుకురాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త శివకుమార్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కలుషిత నీటి సరఫరా

- పగిలిన పైప్‌లైన్లు.. తాగునీటి వాల్వ్ లీకేజీలు
- మంచినీటిలో కలుస్తున్న మురుగునీరు
- గగ్గోలుపెడుతున్న ప్రజలు





ఆల్విన్‌కాలనీలో రోడ్డుపై పారుతున్న నీరు, కుళాయి నుంచి వృథాగా పోతున్న నీరు

ఆల్విన్‌కాలనీ: కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానిక ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. ఓవైపు సీజనల్ వ్యాధులతో ఆసుపత్రుల పాలవుతుండగా కలుషిత నీరు ఎలా తాగాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని జగద్గిరిగుట్ట, రిక్షాపుల్లర్స్ కాలనీ, ప్రగతినగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ, ఆల్విన్‌కాలనీ, రామకృష్ణ నగర్ తదితర కాలనీల్లో పైపులైన్ పగిలిపోగా, తాగునీటి వాల్వ్ లీకేజీతో అందులో మురుగు నీరు చేరి కలుషిత జలం సరఫరా అవుతున్నాయని వాపోయారు. ఇక కొన్ని కాలనీల్లో పైపులైన్ పగిలిపోయి రోడ్డు మీద పారుతున్నాయని ,కొన్ని నెలలుగా తాగునీరు రోడ్ల పాలవుతున్నా తమకేమీ పట్టనట్లుగా నీటిని విడుదల చేసి వెళ్లిపోతున్నారని పలువురు తెలిపారు. ఇదేమిటని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. రిక్షాపుల్లర్స్ కాలనీలో తాగునీరు విడుదల చేసినప్పుడు స్థానికులు సరిపడ నీరు పట్టుకొని కుళాయిలను ఆపకుండా వదిలేస్తుండడంతో రోడ్లపై వేల గ్యాలన్ల నీరు వృథాగా పోతోందని తెలిపారు. నీరు రోడ్లపైన వదిలివేసే వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. రిక్షాపుల్లర్స్ కాలనీలో తాగునీరు పట్టుకున్న తరువాత ఆపే సౌకర్యం లేకపోవటంతో అలాగే వదిలివేస్తున్నారు. అటువంటి కుళాయిలను ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సీజ్ చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.